## ధనుర్మాస శనివారం మద్దులేటి నృసింహుడికి విశేష అభిషేకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03-, పట్టణంలోని తెలుగు పేటలో గల శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ధనుర్మాసం మూడవ శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఘనంగా అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాతఃకాలంలో ఆలయ అర్చకులు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి వారికి పూజాదాతల గోత్రనామాలతో వివిధ రకాల పండ్ల రసాలతో విశేష అభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి నైవేద్యం సమర్పించి మంగళహారతి ఇచ్చారు. ధనుర్మాస ప్రత్యేకతతో నిర్వహించిన ఈ పర్వదిన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో మార్మోగింది.



## మోడల్ స్కూల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03:నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శనివారం సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను స్వయంగా పర్యవేక్షించి, బోధన విధానం, పాఠ్యాంశాల అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. జిల్లాలోని 281 పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం నియమించిన అధికారులతో నిరంతర సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. తనకు కేటాయించిన ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల అభ్యాసన పద్ధతులు, బోధన నాణ్యతను సమగ్రంగా పరిశీలించారు.

## శానిటేషన్‌పై కమిషనర్ కఠిన ఆదేశాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03-:పట్టణంలో శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం సహించబోమని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ఎస్ బి ఐ కాలనీలో కమిషనర్ అకస్మికంగా పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. కాలనీలో చెత్త సేకరణ సరిగా జరగకపోవడం, డ్రెయిన్ల శుభ్రతలో లోపాలు, పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు కనిపించడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం అత్యంత కీలకమని, శానిటేషన్ పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం తట్టుకోబోమన్నారు. రోజువారీ చెత్తను తప్పనిసరిగా సేకరించాలి. డ్రెయిన్లలో మురుగు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. దోమల నియంత్రణకు ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. శానిటేషన్ పనుల్లో బాధ్యతగా పనిచేయని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. శుభ్రమైన పట్టణమే లక్ష్యంగా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ బి శేషన్న ఆదేశించారు.




# పన్నులతోనే పట్టణాభివృద్ధి--

### పన్నులు సకాలంలో చెల్లించాలి--
### మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03 :నంద్యాల పట్టణ అభివృద్ధికి ప్రతి పౌరుడు పన్నులు సమయానికి చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి కుళాయి పన్నులు సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పట్టణంలో మొత్తం 50,038 అసెస్మెంట్లు ఉండగా, వాటికి రూ.35 కోట్ల 29 లక్షల 23 వేల డిమాండ్ ఉందన్నారు. డిసెంబర్ 31 నాటికి రూ.16 కోట్ల 15 లక్షలు వసూలు కాగా, ఇంకా రూ.19 కోట్ల 14 లక్షలు బకాయిలుగా ఉన్నాయని తెలిపారు. నీటి పన్నుల విషయంలో పట్టణంలో 32,820 కనెక్షన్లు ఉండగా, రూ.11 కోట్ల 70 లక్షల 17 వేల డిమాండ్ ఉందన్నారు. ఇప్పటివరకు రూ.4 కోట్ల 31 లక్షలు వసూలు కాగా, ఇంకా రూ.7 కోట్ల 38 లక్షలు బకాయిలుగా ఉన్నాయని వివరించారు. అలాగే పట్టణంలో 2,985 ఖాళీ స్థలాలు ఉండగా, వాటికి రూ.1 కోటి 78 లక్షల 6 వేల డిమాండ్ ఉందని, ఇప్పటివరకు రూ.48 లక్షల 45 వేలు మాత్రమే వసూలైందని తెలిపారు. ఇంకా రూ.1 కోటి 29 లక్షల 61 వేల వసూలు కావాల్సి ఉందన్నారు. ఇటీవల మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా విక్రమ్, శభరిష్ బాధ్యతలు స్వీకరించారని, వారి కృషితో పన్ను వసూలులో వేగం పెరిగిందని తెలిపారు. ప్రతిరోజూ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పన్ను వసూళ్లు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణాభివృద్ధికి పన్నులే కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్నులు చెల్లించాలని వెంకటరెడ్డి పునరుద్ఘాటించారు.

## భూ సమస్యల పరిష్కారానికి కీలక నిర్ణయాలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03 :భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌తో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ వివాదాల పరిష్కారంలో ఆలస్యం లేకుండా నిర్ణీత గడువుల్లో చర్యలు తీసుకుని ప్రజల సంతృప్తి పెంచాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులవారీగా బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ? నిషేధిత భూముల జాబితా చేర్పులుజాయింట్ కలెక్టర్ ? ప్రభుత్వ భూముల పట్టాల మార్పులు, 22-ఏ అప్పీల్స్ పరిష్కారంఆర్డీఓ ? భూ వర్గీకరణ మార్పులు, నిషేధిత జాబితా తొలగింపులుతహశీల్దార్ ? కోర్టు ఉత్తర్వుల అమలు, ఖాతా సవరణలుఇక ప్రజలకు మరింత సులభంగా సేవలందించేందుకు జిఎస్డబ్ల్యూఎస్ ద్వారా ఐదు కొత్త రెవెన్యూ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో వేగం, పారదర్శకతతో పనిచేసి ప్రజల్లో నమ్మకం పెంచాలని అధికారులను ఆదేశించారు.



## మహానందీశ్వరునికి ఘనంగా అన్నాభిషేకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03-మహానంది క్షేత్రంలో వార్షిక ఆర్ద్రోత్సవం, శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని మహానందీశ్వర స్వామివారికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు.



ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు 5 గంటల వరకు ఈ విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆలయ ద్రవ్య శుద్ధి నిర్వహించి, ప్రదక్షిణగా అన్నాన్ని తీసుకువచ్చి పీఠార్చనలు చేపట్టారు. అనంతరం మహాన్యాస పఠనం చేసి సుమారు 200 కేజీలకు పైగా అన్నప్రసాదాన్ని మడితో సిద్ధం చేసి, వేదమంత్రాలు అన్నసూక్తాలతో అభిమంత్రణ చేసి స్వామివారికి వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ వాస్తవ్యులు వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు సహకారం అందించారు. అన్నాభిషేకం అనంతరం ఆర్ద్రోత్సవం, శివ ముక్కోటి సందర్భంగా శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిపై ఉంచి ఉత్తర ద్వారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆర్ద్రా దర్శనం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది.

## సావిత్రి బాయి పూలే జయంతి ఘనంగా నిర్వహణ---

### బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03-నంద్యాల అర్బన్ తాసిల్దార్ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారతదేశ తొలి మహిళా గురువు, సమాజ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళా విద్యకు బాటలు వేసిన సావిత్రి బాయి పూలే సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. అప్పటి సామాజిక అడ్డంకులను ఎదుర్కొంటూ బాలికల కోసం పాఠశాలలు స్థాపించి, సమాజంలో మార్పుకు నాంది పలికిన మహనీయురాలిగా ఆమె చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రామ సంజీవ రావు మాట్లాడుతూ కుల, లింగ వివక్షలను ఎదుర్కొని సమానత్వం కోసం సావిత్రి బాయి పూలే చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరై సిబ్బంది ప్రసాద్, పులికొండన్న, ప్రుధి, మధు మురళి, గిరి గోస్పాడు, మధు ఎన్ జీ ఓస్ కాలనీ తదితరులు పాల్గొన్నారు. సావిత్రి బాయి పూలే చూపిన మార్గంలో నడుచుకుంటూ విద్య, సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.



## ట్రాఫిక్ అవగాహనతో రహదారి భద్రత--

### ట్రాఫిక్ సీఐ చాన్ బాష--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03:నంద్యాల పట్టణంలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో ట్రాఫిక్ సీఐ చాన్ బాష ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. వందేమార్టు సర్కిల్, హైవే రోడ్ చబోలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ తో పాటు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులతో విద్య ప్రాముఖ్యత, హెల్మెట్ తప్పనిసరి వినియోగం, హైవేల్లో వేగ నియంత్రణ అవసరం గురించి వివరించారు. వాహనాల వేగ నియంత్రణ కోసం రేడియం స్టిక్కర్లు అతికించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు. సాయంత్రం రావూస్ ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ప్రాముఖ్యత, మైనర్ డ్రైవింగ్ నివారణ, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలనే అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటిస్తే ప్రాణ నష్టం తగ్గుతుందని ట్రాఫిక్ సీఐ చాన్ బాష తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు టీషర్ట్ పంపిణీ చేసిన మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి..

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.మల్లెలల్ట్రేడ్ రాజు..







విభారే న్యూస్ జనవరి 03 ఎమ్మిగనూరు.. ఎమ్మిగనూరు నందు జరిగే శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల నందు చదువుకునే బాలికలకు మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి 15 జతలు టీషర్ట్, షాట్స్ హెచ్. ఎం. కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు మారతాజ్ కి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లెల గ్రూప్ సంస్థ చైర్మన్ డా : మల్లెలల్ట్రేడ్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి ఎంతోమంది పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఎప్పుడు ప్రోత్సహిస్తూనే ఉంటారు అని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కోదండ రామస్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 03-నంద్యాల పట్టణంలోని పురాతన ప్రముఖ ఆలయం శ్రీ ఆంజనేయ కోదండ రామస్వామి దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ధర్మకర్తల మండలిని నియమించింది. చైర్మన్‌గా నంద్యాలకు చెందిన ప్రముఖ ఈఎన్టీ వైద్యులు డాక్టర్ వి. అనిల్ కుమార్‌ను ఎంపిక చేసింది. మొత్తం 9 మందితో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. సభ్యులుగా బి. పద్మావతి, బి. బజరి, ఎం. నాగయ్య, ఎ. భారతి, ఎం. గురుబాబు, కె. వెంకటలక్ష్మి, ఎన్. జంబులయ్య, జి.వి. సుబ్బయ్యలను నియమించారు. నాలుగో తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు దేవాలయ ప్రాంగణంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం విక్టోరియా రీడింగ్ రూమ్ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ రాజకుమారి, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, విశిష్ట అతిథులుగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, రోటరీ జిల్లా మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామమూర్తి పాల్గొననున్నట్లు తెలిపారు. తనను చైర్మన్‌గా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు డాక్టర్ అనిల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ధర్మకర్తలతో సమావేశం నిర్వహించి, మంత్రి సహకారంతో ఆలయ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**